

## ఇదెక్కడి చోద్యమయ్యా 'బాబూ'!

స్వాతంత్ర్య సమరయోధులైనట్లు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్ చిత్రపటాలతో టీడీపీ నాయకులు నవ్వులపాలయ్యారు. - 8లో



## వెంకటాపురంలో ఇండస్ట్రియల్ పార్క్!

వెంకటాపురంలో ఇండస్ట్రియల్ పార్కు పనులు సాగుతున్నాయి. మరోవైపు పరిహారం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. - 8లో



## 'మాల మహానాడు' నిరసన

ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని మాల మహానాడు నిరసన వ్యక్తం చేసింది. - 8లో

## న్యూస్‌రీల్

### స్వాతంత్ర్య స్ఫూర్తితో ముందుకు..



జెడ్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ గ్లోరియా

చిత్తూరు కార్పొరేషన్: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని జెడ్పీ కార్యాలయంలో చైర్మన్ శ్రీనివాసులు మహాత్మాగాంధీ చిత్రపటానికి సీఈఓ గ్లోరియాతో కలిసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన జెండావందనం చేసి మాట్లాడారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి జెండా వందనం చేసి ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఐజీ గిరిబాబు, ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో ఈఈ మునిచంద్ర, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో డీసీ కిరణ్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో ఎఫ్ఆర్వో థామస్, ఉద్యోగులు, డీఆర్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

### అబద్ధపు హామీలతో 'బాబు' మోసం

కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



వి.కోట: చంద్రబాబు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తుండడంతో రెండు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని కడప మాజీ మేయర్, కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి విచ్చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్.నాగరాజు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అండ్ కో ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. హామీలను ఏ ఒక్కటీ ఇప్పటివరకూ నెరవేర్చకుండా దగా చేస్తున్నాడని, తాము మోసపోయినట్లు ప్రజలు భావిస్తున్నారన్నారు. ఇలాగే ఉంటే 2 ఏళ్లకే కూటమి ప్రభుత్వం పతనమవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, ప్రజల మనసులు గెలుచుకుంటే, బాబు మాత్రం ఎప్పటిలాగే హామీల విషయంలో తన నైజం ప్రదర్శించడంతో ప్రజలు ఛీదరించుకుంటున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చింది మొదలుకుని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు, ఆస్తుల ధ్వంసం చేయడమే టార్గెట్‌గా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచి పనులపై కూడా బురద చల్లడమే పనిగా పెట్టుకుని, ప్రజా సంక్షేమం, ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. ఇదంతా గమనిస్తున్న ప్రజలు వచ్చే 2029 ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీకి తిరుగులేని మెజారిటీతో అధికారాన్ని కట్టబెట్టడం ఖాయమన్నారు.

**స్వాతంత్ర్య స్ఫూర్తి :** సమరయోధుడు టీసీ రాజన్‌ను సత్కరిస్తున్న మంత్రి



**హర్ ఘర్ తిరంగా :** విద్యార్థుల ప్రదర్శన



**లెఫ్ట్.. రైట్ :** పరేడ్‌లో పోలీసుల కవాతు



# పాలనలో బాధ్యత



జెండా ఎగుర వేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య దిన సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. చిత్తూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు హోరెత్తాయి. భరత మాత వేషధారణలో విద్యార్థినులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇక చిన్నారులు మొదలు సీనియర్ సిటిజన్ల వరకు జాతీయ పతాకం స్టిక్కర్లను ధరించి తమ దేశభక్తిని చాటుకున్నారు.

- స్వాతంత్ర్య దిన వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్
- పోలీస్ పరేడ్ మైదానంలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవం
- స్వాతంత్ర్య సమరయోధుడు టీసీ.రాజన్‌కు సత్కారం
- 226 మందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు
- స్వయం సహాయక సంఘాలకు మెగా చెక్కులు

### మెగా చెక్కుల పంపిణీ



డీఆర్‌డీఏ చెక్కులు అందజేస్తున్న మంత్రి

డీఆర్‌డీఏ శాఖ ఆధ్వర్యంలో స్త్రీ నిధి పథకం కింద 9,197 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధి రుణాలకు రూ.61.25 కోట్ల మెగా చెక్కును, 5,376 మంది ఎస్‌హెచ్‌జి మహిళలకు బ్యాంక్ లింకేజీ రుణాల కింద రూ.673.54 కోట్ల మెగా చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఉద్యాన శాఖ పరిధిలో వ్యవసాయ యాంత్రీకరణలో మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్‌లో రూ.88 లక్షలతో 257 పవర్ టిల్లర్లు, మినీ ట్రాక్టర్లు, స్ప్రేయర్లు అందజేశారు. మంత్రి లాంఛనంగా ప్రారంభించి, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్‌ను, పవర్ టిల్లర్లను 50 శాత రాయితీతో పంపిణీ చేశారు.

చిత్తూరు కలెక్టరేట్ : పాలనలో బాధ్యత, జవాబుదారీతనంతో తమ ప్రభుత్వం ప్రతి సోమవారం జిల్లా, డివిజన్స్ మండల కేంద్రాల్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 78వ స్వాతంత్ర్య దిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను తృణప్రాయంగా అర్పించిన మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నిత్యం కరువుతో సతమవుతున్న రాయలసీమకు వేసవి కాలంలో సైతం సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పరిధిలోని పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ కాలువలను పూర్తి చేసి నీరు అందించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ రెండు కాలువల పనులు పూర్తయిన వెంటనే 43,300 ఎకరాలకు కృష్ణా జలాలు అందించడంతో పాటు 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని, చిత్తూరు, తవణంపల్లె, ఐరాల, గంగాధరనెల్లూరు, గుడిపాల, పెనుమూరు మండలాల్లో 17 చెరువులు, కాలువల అభివృద్ధి పనులకు రూ.14.28 కోట్ల పరిపాలన ఆమోదం లభించినట్లు చెప్పారు. ఇందులో 7 పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు పూర్తి కాగానే 2,745 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడుతుందన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 226 మందికి ప్రశంసాపత్రాలు, కొందరికి జ్ఞాపికలను అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, పలమనేరు వాసి టీసీ రాజన్‌ను మంత్రి సత్కరించారు. కవాతుల్లో ప్రతిభ కనబరచిన వారిని అభినందించారు. ఈ వేడుకల్లో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, నగర మేయర్ అముద, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, థామస్, మురళీమోహన్, కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఆర్డీఓ చిన్నయ్య, చిత్తూరు తహసీల్దార్ కళావతి, వివిధ శాఖల అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

జిల్లాలోని వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. మొదట శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల వినూత్న కార్యక్రమాలు తెలియజేసే శకటం ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖకు చెందిన మిస్ట్ బుల్లెట్, మిస్ట్ జీపు శకటాలు, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్, చంద్రన్న సంచార ఆరోగ్య పథకం, తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్, 108 వాహనాల శకటాలు, వ్యవసాయ శాఖకు చెందిన చిరుధాన్యాల శకటం, చిత్తూరులో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలుపుతూ నగర పాలక సంస్థ శకటం, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పెన్షన్, మహిళా మార్ట్, జీవనోపాధులు, నిరుద్యోగులకు సీడాప్ ఉద్యోగావకాశాలను తెలియజేసే శకటం, వివిధ సంక్షేమ పథకాల కార్యక్రమాలను వివరించేలా శకటాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. మంత్రి, కలెక్టర్ బహుమతులను అందజేశారు.



వ్యవసాయశాఖ శకటం



వైద్య ఆరోగ్యశాఖ శకటం



విద్యాశాఖ శకటం

### దేశభక్తి పూరితం

పరేడ్ మైదానంలో వివిధ విద్యాసంస్థల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఆర్.కె.మోడల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, విజయం విద్యా సంస్థలు, ర్యాంకర్స్ స్కూల్, క్యాంఫోర్డ్ ,డాక్టర్ వరదప్ప నాయుడు మున్సిపల్ హైస్కూల్, బీవీ రెడ్డి సీనియర్ సెకండరీ స్కూల్, న్యూయార్క్ స్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు, కస్తూర్బా మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు దేశభక్తి పూరిత నృత్యాలతో అలరించారు. ప్రతి పాఠశాల జట్టుకు మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.





## ఉత్తమ స్కూళ్లుగా బొమ్మసముద్రం, ఎస్ఆర్ పురం



సీఎం నుంచి అవార్డులు అందుకుంటున్న హెచ్‌ఎంలు విజయకుమారి, శ్రీనివాసులు

గుడిపాల / శ్రీరంగరాజపురం : రాష్ట్ర స్థాయిలో బెస్ట్ స్కూల్ అవార్డును బొమ్మసముద్రం, ఎస్ఆర్ పురం స్కూళ్లు అందుకున్నాయి. గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం ప్రభుత్వ పాఠశాల, శ్రీరంగరాజపురంలోని జెడ్పీ హైస్కూల్ ఈ అవార్డుకు ఎంపికయ్యాయి. స్వాతంత్ర్య దినోత్సవం నాడు విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆ స్కూళ్ల హెచ్‌ఎంలు విజయకుమారి, శ్రీనివాసులు అవార్డు అందుకున్నారు.

# రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం

- మాపై పనికట్టుకుని కొన్ని పత్రికలు, చానళ్లు తప్పుడు ప్రచారం
- అలాంటి వారిపై పరువు నష్టం దావా వేస్తాం
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి ధ్వజం



జెండా వందనం చేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి మంగళం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతి భద్రతలకు విఘాతం కలిగిందని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి మారుతీనగర్‌లోని తన క్యాంప్ కార్యాలయం వద్ద 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన ఎందరో త్యాగమూర్తులను స్మరించుకుని, ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధి కోసం వారి అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం ఇస్తే వారు మాత్రం రెడ్‌బుక్ పాలన సాగిస్తూ శాంతి భద్రతలను మంటగలుపుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తమ కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. నోటికొచ్చిన అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. తమపై చూపుతున్న శ్రద్ధ ప్రజలకు ఇచ్చిన హామీలపై చూపితే మంచిదన్నారు. అలా కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇకపై పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం అందే పరిస్థితి లేదన్నారు. రెండు నెలల్లో ఆరోగ్య శ్రీకి రూ.2,500 కోట్లు ప్రభుత్వం బకాయి పడిందన్నారు. దీన్ని బట్టి త్వరలోనే ఆరోగ్యశ్రీని చంద్రబాబు నిర్వీర్యం చేసే అవకాశం ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రభుత్వాస్పత్రుల్లో పేదలు ఫీజులు చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి వస్తుందేమోనన్నారు.

### పరువు నష్టం దావా వేస్తాం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తామే టార్గెట్‌గా చంద్రబాబు, లోకేష్ పెట్టుకున్నారని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తమపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్న కొన్ని పత్రికలు, చానళ్లపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం చేసిన, చేస్తున్న తప్పులను దాచేసి తమ కుటుంబంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. త్వరలోనే కోర్టు ద్వారా ఎల్లో మీడియాకు తగిన గుణపాఠం చెబుతామన్నారు.

## శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,967 మంది స్వామివారిని దర్శించుకోగా 32,421 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.26 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

## క్లుప్తంగా

### జిల్లాలో సీఐల బదిలీ

ఏడుగురికి నో పోస్టింగ్

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమోషీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే వెలువడ్డ మూడు బదిలీల ఉత్తర్వుల్లో 13 మంది సీఐలకు పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం.. తాజాగా మరో ఏడుగురికి పోస్టింగ్ ఇవ్వకుండా వేకెంట్ రిజర్వు (వీఆర్)కు పంపుతూ ఆదేశాలు జారీ చేసింది. పలమనేరు అర్బన్‌లో పనిచేస్తున్న సి.చంద్రశేఖర్, నగరి రూరల్‌లో ఉన్న పి.సుబ్బిరామిరెడ్డి, పలమనేరు రూరల్‌లో ఉన్న ఇ.కృష్ణమోహన్‌లను చిత్తూరు వీఆర్‌కు పంపించారు. శ్రీకాళహస్తి రూరల్‌లో ఉన్న కె.అజయ్‌కుమార్, తిరుమల ట్రాఫిక్‌లో ఉన్న పి.శ్రీరాములు, అలిపిరిలో ఉన్న ఎం.రామారావు, తిరుపతి ఎంఆర్.పల్లెలో ఉన్న తమీమ్ అహ్మద్‌లను తిరుపతి వీఆర్‌కు కేటాయించారు. ఇక ఆదోనిలో పనిచేస్తున్న పి.నరసింహరాజును పలమనేరు అర్బన్‌కు, శ్రీసిటీలో ఉన్న పి.భాస్కర్‌ను నగరి రూరల్‌కు, పత్తికొండలో ఉన్న కె.మురళీమోహన్‌ను పలమనేరు రూరల్‌కు, తిరుపతి సీఐడీలో ఉన్న ఎం.రవినాయక్‌ను శ్రీకాళహస్తి రూరల్‌కు, తిరుపతి వీఆర్‌లో ఉన్న ఎం.ఈశ్వర్‌ను తిరుపతి పీసీఆర్‌కు, తిరుపతి ఇంటెలిజెన్స్‌లో ఉన్న సి.హరిప్రసాద్‌ను తిరుమల ట్రాఫిక్‌కు, కడప తాలూకలో ఉన్న ఎం.తిమ్మయ్యను బీఎన్.కండ్రిగకు, తిరుపతి ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో ఉన్న జి.శ్రీనివాసులును పుంగనూరు అర్బన్‌కు, తిరుపతి సీఐడీలో ఉన్న పీఎస్‌వి.రామకిషోర్‌ను అలిపిరికి, అన్నమయ్య ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక విభాగంలో ఉన్న సాధిక్ అలీను తిరుపతి ఎంఆర్.పల్లె, అనంతపురం మహిళా స్టేషన్‌లో ఉన్న ఎ.సంజీవకుమార్‌ను తిరుపతి ట్రాఫిక్‌కు బదిలీ చేస్తు ఆదేశాలు వెలువడ్డాయి.

### కారు ఢీకొని వృద్ధుడు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వృద్ధుడు

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల క్రాస్ వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందినట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. కేజీ సత్రం గ్రామానికి చెందిన చెంగల్‌రాయులు(83) రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పురస్కారాల సంబరం

జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో పురస్కారాల ప్రదానం వేడుకగా సాగింది. జిల్లాలోని వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పోలీసులకు మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ పురస్కారాలు ప్రదానం చేశారు. పలువురు గ్రహీతలు...కుటుంబ సభ్యులతో కలిసి పరేడ్‌లో సందడి చేశారు. ప్రశంసాపత్రం అందుకుంటుండగా కుటుంబ సభ్యులు ఫొటోలు తీస్తూ కనిపించారు.

– చిత్తూరు కలెక్టరేట్


రాజశేఖర్, పీడీ, డ్వామా, మనోజ్‌రెడ్డి ఆర్డీఓ, పలమనేరు, అరుణ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్, చిత్తూరు, ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, ప్రభాకర్, జేడీ, పశుసంవర్ధకశాఖ


మంత్రి, కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న టి.లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి


గౌస్‌బాషా, జిల్లా సర్వే ఏడీ, హరీష్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, సాంబశివారెడ్డి, సీపీఓ, చిత్తూరు, ఉమామహేశ్వరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, రఘువీర్ విష్ణు, డీఎస్పీ, రాజగోపాల్‌రెడ్డి, ఎస్‌డీపీఓ, ఇలియాజ్‌బాషా, ఏఆర్.డీఎస్పీ


గోవిందయ్య, డీడీ, పశుసంవర్ధకశాఖ, పుత్తూరు, రవీంద్రనాథ్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, చిత్తూరు, హిమబిందు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, చిత్తూరు, శైలజ, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, చిత్తూరు, జయప్రకాష్, సమగ్రశిక్ష, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, హరినాథ్‌రెడ్డి, జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఈడీ, డీసీఆర్‌బీ సీఐ బాలయ్య, సుదర్శన్, జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్

## ఇదెక్కడి చోద్యమయ్యా 'బాబూ'..!


విద్యార్థులకు సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే, మంత్రి లోకేష్ చిత్రపటాలను చూపుతున్న టీడీపీ నేతలు

వి.కోట: సాధారణంగా స్వాతంత్ర్య దిన సంబరాల్లో సమరయోధుల చిత్రపటాలు ప్రదర్శించడం, వారి త్యాగాల గురించి స్ఫూర్తిదాయకంగా చెప్పడం పరిపాటి. ఇది చాలావరకు అన్ని స్కూళ్లలో చేసేదే. అయితే మండలంలోని ముదరందొడ్డి ఉన్నత పాఠశాలలో మాత్రం దీనికి భిన్నంగా చోటుచేసుకోవడం చర్చకు తావిచ్చింది. గురువారం ఇక్కడి వేడుకల్లో పంచాయతీ టీడీపీ నాయకుల వ్యవహరించిన తీరు నవ్వుల పాలైంది. స్వాతంత్ర్య సమరయోధుల లెవెల్లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి చిత్రపటాలను చేతపట్టుకుని విద్యార్థులకు చూపించారు. సీఎం చిత్రపటాన్ని పంచాయతీ సీనియర్ టీడీపీ నాయకుడు ఓబుల్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటాన్ని ఎంఎస్‌సీ కమిటీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, లోకేష్ చిత్రపటాన్ని ఝాన్సీ పట్టుకుని వేడుకల్లో వారి గురించి చెప్పారు. అక్కడికి హాజరైన ప్రజలు, పలువురు వక్తలు ఇది చూసి విస్తుపోయారు!

## ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన మురుగేష్

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గూడూరు రూరల్ మండలం, పొలిచర్లరాజుపాళెం గ్రామానికి చెందిన బండి మురుగేష్ సమీప బంధువైన వెంకటేశ్వర్లుకు చెందిన ఐచర్ లారీలో చెన్నై నుంచి గూడూరు వైపు వెళుతున్నారు. మురుగేష్ ఐచర్ లారీ డోరు పక్కనే అతని చెయి పెట్టుకుని కూర్చుని ఉన్నాడు. లారీ పండ్లూరు గ్రామ సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న మరో లారీ వేగంగా వచ్చి ఐషర్ లారీ డోరు పక్కగా వచ్చి ఢీకొంది. దీంతో మురుగేష్ ఎడమ భుజాని తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చేయి చాల వరకు తెగిపోవడంతో అతనిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు. అయితే ఐషర్ లారీని ఢీకొన్న మరో లారీ అక్కడ నిలప కుండా వెళ్లిపోవడంతో దాని ఆచూకీ తెలియ రాలేదు. ఈ విషయమై బాధితులు రాత్రి వరకు కూడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ గోపి తెలిపారు.

## మా సమస్యలు పరిష్కరించరూ..!

- మంత్రి సత్యకుమార్‌కు హెడ్ నర్సుల అసోసియేషన్ వినతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): హెడ్‌నర్సుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా మహిళా హెడ్‌నర్సుల అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ విన్నవించారు. గురువారం చిత్తూరుకు విచ్చేసిన ఆయన్ను అసోసియేషన్ సభ్యులంతా కలిశారు. ఉద్యోగోన్నతి ఇవ్వాలి, నైట్‌డ్యూటీ, రిస్క్ అలవెన్స్‌లు, సరెండర్ లీవ్ పే ఇవ్వాలని కోరారు. నర్సులు మల్లమాంబ, జగదాంబలకు మిస్ మ్యాచింగ్ పోస్టుల కారణంగా వేతనాలు రాలేదని, చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో పని చేసే సిబ్బందికి వేతనాలు రాలేదని విన్నవించారు. బయోమెట్రిక్ హాజరు మినహాయింపు ఇవ్వాలని, ఎంపీహెచ్‌ఏలకు హెచ్‌ఆర్‌ఎం ఐడీ, జీతాలు రాలేదని, ఏఎన్‌ఎంలను రెగ్యులరైజేషన్ చేయాలని, ఎంపీహెచ్‌ఈఓ, ఎంపీహెచ్‌ఎస్‌లకు ఉద్యోగోన్నతి ఇవ్వాలని కోరారు.

## ఢిల్లీ వేడుకల్లో సత్యవేడు విద్యార్థులు


ఢిల్లీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

వరదయ్యపాళెం: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన 78వ స్వాతంత్ర్య వేడుకలకు వరదయ్యపాళెం మండల సంతవేలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఝాన్సీ, బుచ్చినాయుడు కండ్రిగ మండలం కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకులం పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి యువకిరణ్ నాయక్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. వీరి వెంట తెలుగు ఉపాధ్యాయురాలు లత పాల్గొన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో ప్రధానమంత్రి సంగ్రాలయ, ఇండియా గేట్, నేషనల్ మెమొ, రాజ్‌ఘాట్‌లను సందర్శించే ఏర్పాటు చేశారు. అలాగే గురువారం సాయంత్రం నాలుగు నుంచి 6 గంటల మధ్య కేంద్ర విద్యాశాఖమంత్రి వీరితో ముచ్చటించారు. జూన్ నెలలో జరిగిన ప్రేరణ కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు గెలుపొంది తిరుపతి జిల్లా తరఫున గుజరాత్ రాష్ట్రంలోని వాడ్‌నగర్‌లో జరిగిన 10 రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. అందుకే ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు వీరికి ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం కల్పించినట్లు టీచర్ లత తెలిపారు.

## 'మాల మహానాడు' నిరసన

పెద్దపంజాణి: మండలానికి చెందిన మాల మహానాడు నేతలు నల్ల బ్యాడ్జీలతో స్థానిక మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. మండల శాఖ అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మందకృష్ణ మాదిగ, సీఎం చంద్రబాబునాయుడుతో చీకటి ఒప్పందాలు చేసుకుని మాలల మనోభావాలను దెబ్బ తీశారని మండిపడ్డారు. గతంలో సుప్రీం కోర్టులో పనిచేసిన న్యాయమూర్తులు ఎస్సీ వర్గీకరణ చేయడం కుదరదని చెప్పినా నరేంద్రమోదీ తన అనుకూల న్యాయమూర్తులతో వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇప్పించడం బీజేపీ కుయుక్తులకు నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ చేయరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారుఆంధ్ర రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టరాదని విజ్ఞప్తి చేశారు. నేతలు రెడ్డెప్ప, శివన్న పాల్గొన్నారు.

## రెండు ఇసుక లారీల సీజ్

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం జ్ఞానమ్మ కండ్రిగ వద్ద ఇసుక డంపు నుంచి అక్రమ రవాణాకు సిద్ధం చేసిన రెండు ఇసుక లారీలను గురువారం సెబ్ అధికారులు సీజ్ చేశారు. విరూపాక్షపురం స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా తరలించి జ్ఞానమ్మకండ్రిగకు చెందిన టీడీపీ నాయకుడు ఇటుకబట్టిలో డంప్ చేసి, అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై సాక్షిదినపత్రికలో వచ్చిన కథనాలతో సెబ్ అధికారులు నిఘా పెట్టి టీడీపీ నాయకులు గుట్టు బయటపెట్టారు. లారీలను టూ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో తడకు చెందిన లారీ డ్రైవర్లు రాజేష్, దినేష్‌ల పైన, లారీలోకి ఇసుక నింపుతున్న జేసీబీ యజమాని, టీడీపీ నేత వెంకటేశ్వర యాదవ్ పైన కేసు నమోదు చేసారు.

**ఇసుక ట్రాక్టర్ సీజ్**

తిరుపతి రూరల్: స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సెబ్ ఎస్ఐ భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం రూరల్ మండలంలో తనిఖీలు చేపట్టినట్టు వెల్లడించారు. పద్మావతిపురం మ్యాంగో మార్కెట్ వద్ద ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించినట్టు తెలిపారు. విచారణలో తనపల్లిలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ కన్నయ్యపై కేసు నమోదు చేసారు.



# వెంకటాపురంలో ఇండస్ట్రియల్ పార్క్!

- 67.91 ఎకరాల్లో పారిశ్రామిక విస్తరణ
- మౌలిక సదుపాయాలకు రూ.14.03 కోట్లు మంజూరు
- పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు


వెంకటాపురం వద్ద జరుగుతున్న ఇండస్ట్రియల్ పార్కు రోడ్డు పనులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం 5.వెంకటాపురంలో ఇండస్ట్రియల్ పార్క్ పనులు సాగుతున్నాయి. అంతర్గత రహదారి, ప్రధాన డ్రైనేజీ, విద్యుత్ సరఫరా నిర్మాణ పనులు చేస్తున్నాయి. 67.91 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక వాడను విస్తరిస్తోంది. ఇందుకు ఏపీఐఐసీ రూ.14.03 కోట్లు వ్యయం చేస్తోంది. విశాలమైన 39 ప్లాట్లుగా తీర్చిదిద్దింది. వీటిపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపుతున్నారు. ఈ పార్క్ వృద్ధి చెందితే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అయితే రైతులకు ఇవ్వాల్సిన పరిహారం ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో నిరీక్షిస్తున్నారు.

చిత్తూరు మండలం 5.వెంకటాపురం వద్ద 2017లో ఎంఎస్‌ఈసీడీపీ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ స్కీం) కింద ఏపీఐఐసీ చిత్తూరు జోన్ ఆధ్వర్యంలో భూ పరిశీలన చేసింది. అక్కడ 98.37 ఎకరాల భూమిని గుర్తించి రెవెన్యూ అధికారులకు నివేదికలు సమర్పించింది. ఆ భూమి పారిశ్రామిక పార్కుకు అనుకూలంగా ఉందని అందులో పేర్కొంది. ఈ మేరకు వారి అనుమతులు లభించాయి. ఇందుకుగాను 2019లో ఏపీఐఐసీ రెవెన్యూకు రూ.4.88కోట్లు చెల్లించింది. అయితే ఈ పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు 2022 జనవరిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు తీసుకొచ్చింది. ఆ భూమిలో 25 ఎకరాలు కేటాయించింది. 2023 నవంబర్‌లో పార్క్ అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.14.03కోట్లు మంజూరు చేసింది. ఇందులో కేంద్రం 10.01 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.4.29కోట్లు వెచ్చించింది.

**సరిహద్దులో...**

ఈ పారిశ్రామిక పార్క్.... తమిళనాడు సరిహద్దుకు 3 కి.మీ దూరంలో ఉంది. బీఎన్‌ఆర్‌పేట, అనంతాపురం మీదుగా శెట్టిన్ తంగాల్‌ను ఆనుకుని ఉన్న తమిళనాడు సరిహద్దుకు చేరుకోవచ్చు. ఈ మార్గం మీదుగా తమిళనాడులోని పొన్నై, షోలింగర్, తిరుత్తణి మీదుగా చెన్నైకు వెళ్లేందుకు అనువుగా ఉంటుంది. తాళంబేడు, చీలాపల్లె, పేయనపల్లె మీదుగా చీలాపల్లె క్రాస్, గుడిపాల, నరహరిపేట మీదుగా తమిళనాడులోని చెన్నై, వేలూరుకు చేరుకోవచ్చు. దీనికితోడు చీలాపల్లె క్రాస్ నుంచి గంగసాగరం, కలెక్టర్ ఆఫీసు మీదుగా బెంగళూరు వెళ్లేందుకు అనువుగా ఉంది. దీనిమూలాన 5.వెంకటాపురం ఇండస్ట్రియల్ పార్క్ భవిష్యత్‌లో అభివృద్ధి పథంలోకి రావచ్చని, ఇక్కడ పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకొస్తే అభివృద్ధి పథంలో పయనిస్తుందని ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. ఇక పార్క్‌ను ఆనుకుని మూడు సిమెంట్, గ్రానైట్ ఫ్యాక్టరీలు సైతం నడుస్తున్నాయి. తమిళనాడు వాసులే వీటిని నిర్వహిస్తున్నారు. ఇక్కడ తయారయ్యే సిమెంట్, గ్రానైట్లు అధికంగా తమిళనాడుకు తరలుతోంది. వీరికి శెట్టిన్ తంగాల్ మీదుగా తమిళనాడుకు రవాణా సులభతరం అవుతోంది. తద్వారా ఇక్కడ పరిశ్రమలు స్థాపనకు పలువురు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది.

**అందని పరిహారం**

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటులో భాగంగా 89 మంది రైతుల నుంచి భూ సేకరణ చేశారు. అప్పట్లో వీరికి సెంటుకు రూ.6వేల చొప్పున పరిహారం ఇచ్చారు. ఇలా 83 మంది రైతులకు రూ.3 కోట్ల వరకు చెల్లించారు. మిలిగిన ఆరుగురు రైతులకు రూ.35 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఏడేళ్లకు పైగా పరిహారం కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. చిత్తూరు రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ సెంట్ భూమి రూ.35వేలు పలుకుతోందని, తమకు మాత్రం పరిహారం ఇవ్వకపోవడం శోచనీయమని బాధిత రైతులు వాపోతున్నారు.

**సదుపాయాలు ఇలా...**


మౌలిక సదుపాయాలకు కేటాయించిన రూ.14.03 కోట్లతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. 67.91ఎకరాల్లో పారిశ్రామిక పార్కు రూపుదిద్దుకుంటోంది. ఇందులో 36 ఎకరాల్లో ప్లాట్లు వేయగా, 31.91 ఎకరాల్లో రోడ్లు, కాలువ నిర్మాణ పనులు చేస్తున్నారు. బీఎన్‌ఆర్‌పేట రోడ్డు నుంచి పారిశ్రామిక పార్క్‌కు అనుసంధాన రోడ్డు విశాలంగా రూపుదిద్దుకుంటోంది. మరో మూడు నెలల్లో ఈ పనులు పూర్తికానున్నాయి. అనంతరం ప్లాట్లు ఆన్‌లైన్‌లోకి రానున్నాయి. ఏడాదిలోపు ఈ పార్కుకు విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. వీటిని బడుగు, బలహీన వర్గాలకు రాయితీతో ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**పరిహారం..పరిహాసం**



పరిహారం కోసం వెళ్లి పరిహాసం అవుతున్నాం. అభివృద్ధి అయితే మా ఊరు బాగుపడుతుందని, ఉపాధి ఉంటుందని ఆలోచించాం. పార్క్‌కు భూములిచ్చాం. నాకున్న 96 సెంట్ల భూమిని ఏపీఐఐసీ వాళ్లు తీసుకున్నారు. ఇందుకు గాను రూ.5.76 లక్షల వరకు రావాల్సి ఉంది. ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. ఈ విషయంలో అధికారులు స్పందించాలి. ఇకనైనా జాప్యం చేయకుండా మాకు పరిహారం అందేలా చూడాలి. –హరిబాబు, రైతు

**పరిహారం ఇవ్వాలి కదా..**



మా ఊరి పక్కన పరిశ్రమలు వస్తాయంటే ఆనందంగానే ఉంది. మా ఊళ్లో పిల్లలకు ఏదో ఉపాధి దొరుకుతుందని అనుకున్నాం. భవిష్యత్ తరాల వారైనా బాగుపడతారని ఆశించాం. కానీ మాకు రావాల్సిన పరిహారం మాత్రం ఇంతవరకు రాలేదు. రెండు ఎకరాలకు గాను రూ.13 లక్షల వరకు రావాల్సి ఉంది. అధికారులు మా గోడు పట్టించుకోవాలి. పరిహారం ఇచ్చేలా చూడాలి. –సుందర్‌రాజ్, రైతు

**రాయితీలు ఉంటాయి**

నూతనంగా ఏర్పాటవుతున్న ఇండస్ట్రియల్ పార్క్‌లో 18 ఎస్సీ, ఎస్టీలకు రిజర్వులో ఉంటాయి. ఎస్సీ, ఎస్టీల్లో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి 50 శాతం వరకు రాయితీ ఉంటుంది. ఇది ఏపీఐఐసీ ద్వారా రాయితీ. మళ్లీ ఇతర శాఖల ద్వారా కూడా రాయితీలుంటాయి. మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తి కాగానే త్వరలో అందరికీ ప్లాట్లు కేటాయిస్తాం. – పురుషోత్తం, మేనేజర్, ఏపీఐఐసీ, మేనేజర్

**పరిహారం అందేలా చూస్తాం**

పరిహారం రాని రైతు వివరాలపై ఆరా తీస్తాం. వారి వివరాలు తెలుసుకుంటాం. రైతులను నేరుగా కలిసి వారికి న్యాయం జరిగేలా చూస్తాం. ఇన్నాళ్లు పరిహారం అందకపోవడంలో లోపాలను గుర్తించి వాటిని పరిష్కరించేలా చూస్తా. ఆందోళన వద్దు.

–చిన్నయ్య, ఆర్డీఓ, చిత్తూరు